అఖిలాండం వద్ద

# భద్రతా సిబ్బంది డబ్బులు వసూలు

**శ్రీవారి పుష్కరిణిలో సబ్బులు,షాంపులతో స్నానం చేస్తున్నారు -"డయల్ యువర్ ఈఓ"కు భక్తులు**



తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:
కొండపై భక్తులు భక్తితో కర్పూరం వెలిగించి కొబ్బరికాయలు కొట్టే అఖిలాండం వద్ద చిరువ్యాపారుల నుండి భద్రత సిబ్బంది డబ్బులు వసూలుచేస్తున్నారని ప్రధాన ఆరోపణతో భక్తుడు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌కు చెందిన తిరుపతయ్య ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఈఓకు తెలిపాడు. దీనిపై స్పందించిన ఈఓ శ్యామలరావు వివరాలు తెలియజేస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌నుండి బిందు మాట్లాడుతూ శ్రీవారి పుష్కరిణిలో పరిశుభ్రత పాటించడం లేదని, సబ్బులు,షాంపులతో స్నానం చేస్తున్నారన్నారు. దీనిపై సమాధానంగా ఈఓ గమనించి విచారణ చేసి తగిన విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఈఓ"కార్యక్రమం జరిగింది. దేశంలోని పలుప్రాంతాలనుండి దాదాపు 35మంది భక్తులు తమతమ సూచనలు,సలహాలు తెలియజేశారు. పరకామణిసేవలో పాల్గొన్నవారికి ప్రతి రోజూ దర్శనం కల్పిస్తే బావుంటుందని ,65ఏళ్లు దాటిన వారికి లడ్డూసేవ ఇవ్వాలని హైదరాబాద్‌నుండి సత్యనారాయణ కోరారు. దీనిపై ఈఓ శ్యామలరావు స్పందిస్తూ పరకామణిసేవకులకు ప్రతిరోజూ దర్శనం కల్పించడం సాధ్యంకాదని, లడ్డూసేవను గతంలో ప్రయత్నించినప్పటికీ సరైన ఫలితాలు రాలేదన్నారు. దేవరపల్లినుండి ప్రసాదరాజు మాట్లాడుతూ గతంలో తిరుమలలో సిఆర్‌ఓతోబాటు అనేక ప్రాంతాల్లో గదులు కేటాయింపు కేంద్రాలు ఉండేదని, ప్రస్తుతం సిఆర్‌ఓలో మాత్రమే ఉండటంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇందుకు ఈఓ సమాధానంగా ఇతరప్రాంతాల్లో గదులు కేటాయింపు వల్ల సమస్యలు వస్తున్నాయని, సిఆర్‌ఓకే పరిమితం చేశామన్నారు. దీనిపై భక్తుల నుండి మంచిస్పందన వస్తోందన్నారు. కడపనుండి సుధాకర్‌మాట్లాడుతూ దివ్యాంగులను వీల్‌ఛైర్‌లో ఆలయంలోపలకు అనుమతించాలని కోరారు. దీనిపై ఈఓ సమాధానంగా ఆలయంలో స్థలాభావం వల్ల సాధ్యంకాదని తెలిపారు. హైదరాబాద్‌నుండి ఉషారాణి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ దర్శనాల్లో సహాయకులుగా మరొకరిని పంపించేందుకు వీలవుతుందా అని అడిగారు. ఈఓ శ్యామలరావు సమాధానంగా సీనియర్ సిటిజన్లకు సహాయం అందించేందుకు శ్రీవారి సేవకులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇసత్యనారాయణ, డిప్యూటీ ఈఓలు లోకనాథం(ఆలయం),భాస్కర్(వసతికల్పన), రాజేంద్రకుమార్ (అన్నదానం), వెంకటయ్య(కల్యాణకట్ట), రవాణ జిఎం శేషారెడ్డి, ఉద్యానవనవిభాగం డిడి శ్రీనివాసులు, విఎస్‌ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమ, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**



# మద్యం సేవించిన ఏపిఎస్‌పి పోలీసులు సస్పెన్షన్

**కర్నూలు బెటాలియన్ కమాండెంట్ పాటిల్ ఆదేశం**

తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:
శాంతిభద్రతలు కాపాడటం, తిరుమల ఆలయ భద్రత విధుల్లో ఉంటూ మద్యంసేవించి మత్తులో హంగామా చేసిన ఏపిఎస్‌పి పోలీసులు ముగ్గురిని సస్పెన్షన్ చేశారు. ఈమేరకు కర్నూలు బెటాలియన్ కమాండెంట్ పాటిల్ ఆదేశాలిచ్చారు. అంతేగాక ఆర్‌ఐకి ఛార్జిమెమో ఇచ్చారు. ఏపిఎస్‌పి పోలీసులు కర్నూలుకు చెందిన బి.రాజశేఖర్, కె.ఓంకార్‌నాయక్, ,షేక్ సిరాజుద్దీన్ విధుల్లో ఉండి మద్యం సేవించి, ప్రమాదం చేయడం, తదుపరి హంగామాచేయడంతో ఈ వేటుపడింది.

# కుప్పం పర్యటనకు సిఎం చంద్రబాబు రాక

**- అధికారులు.. నేతలచే ఘన స్వాగతం !! నేడు కుటుంబసభ్యులతో సొంతింటి గృహ ప్రవేశం !!**

కుప్పం, మే 24 ప్రభాతవార్త
కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు శనివారం రాత్రి ఘనస్వాగతం లభించింది. ఆదివారం శాంతిపురం మండల ం శివపురం వద్ద సిఎం చంద్రబాబునాయుడు సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబునాయుడు శనివారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో కుప్పం పిఇఎస్ అతిథిగృహంకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు మెంబర్ వైద్యం శాంతారాం, కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్ తదితరులు ఘనస్వాగతం పలికారు



## నేడు సిఎం సొంతింటి గృహ ప్రవేశం



శాంతిపురం, మే 24 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు శాంతిపురం మండలం శివపురం వద్ద సొంత ఇల్లు నిర్మించిన విషయం విదితమే. ఈ నూతన ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కుటుంబీకులు, తెదేపా నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయాక సిఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చి అక్కడనుంచి రోడ్డు మార్గంలో బేతమంగళ, వి.కోట మీదుగా కుప్పం చేరుకున్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కూడా రాత్రే చేరుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శనివారం 12 గంటల ప్రాంతంలో శివపురం వద్ద నిర్మించిన సొంత ఇంటికి చేరుకున్నారు. గృహ ప్రవేశం సందర్భంగా నియోజకవర్గంనుంచే కాక జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి ప్రముఖులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశాలు కన్పిస్తు న్నాయి. గృహ ప్రవేశం సందర్భంగా దాదాపు 25వేల మంది ప్రజలు, 2వేలమంది విఐపిలకు విందు భోజనం ఏర్పాట్లను ముఖ్యమంత్రి కుటుంబీకులు చేపట్టారు.

# క్యాన్సర్ లేని సమాజ ఆవిష్కరణకు కృషి

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి**



సంక్రమిక, అసంక్రమిక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి

చిత్తూరు రూరల్, మే 24 ప్రభాతవార్త:
క్యాన్సర్ లేని సమాజ అవిష్కరణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పిలుపునిచ్చారు. చిత్తూరు డిఆర్‌డిఎ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ప్రజలకు సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంక్రమిక వ్యాధులు అంటే వ్యాధి ఒకరి ద్వారా మరొకరికి వ్యాప్తి చెందదని, వీటిని దీర్ఘకాలిక వ్యాధులు అంటామని, గుండెజబ్బు, క్యాన్సర్, థైరాయిడ్, బీపీ, షుగర్ తదితర వ్యాధులన్నారు. ఈ వ్యాధులు మనిషికి ఒకసారి వస్తే జీవితాంతం మందులు వాడాల్సి వుంటుందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇంటింటి ఎన్‌సిడి సర్వే నిర్వహిస్తోందని, ఈ సర్వేలో బిపీ, షుగర్, క్యాన్సర్ వంటివి స్క్రీనింగ్ చేసి చికిత్స చేయించి వారికి మందులు ఫాలోఅప్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే అంటు వ్యాధులకు సంబంధించి ఈ సీజన్‌లో డెంగ్యూ, మలేరియా కనిస్తోందని, ప్రతి ఒక్కరు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను సమిష్టిగా పాటిస్తే లార్వాలు నశించి డెంగ్యూ ప్రబలకుండా వుంటుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, శ్రీవాణి, జయరాముడు, రాజేంద్రప్రసాద్, డిఆర్‌డిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో పుంగనూరును చేర్చేందుకు అంగీకరించం

**జిల్లా కేంద్రానికి 148 కిలోమీటర్లు దూరం - ప్రజలలో పెల్లుబుకుతున్న వ్యతిరేకత**

పుంగనూరు, మే 24, ప్రభాతవార్త
చిత్తూరు జిల్లాలోని పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో భాగమై ఉన్న పుంగనూరు నియోజకవర్గం పలుసార్లు రూపురేఖలు కోల్పోయి ఇప్పుడు పుంగనూరు చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలతో ఉంది. ఈ క్రమంలో మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని గత ప్రభుత్వం హామీలు ఇచ్చి వాటిని బుట్ట దాఖలు చేసింది. ఒకవేళ మదనపల్లె జిల్లా కేంద్రం అయి ఉంటే పుంగనూరు మదనపల్లి జిల్లాలో కలిసే దానికి సుముఖత వ్యక్తం చేసేది. జిల్లాల విభజన జరిగే చాలా ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం అత్యంత దారుణమైన చేయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు నుంచి కడప 148 కిలోమీటర్ల దూరం ఉండగా దాదాపు మూడున్నర గంటలసేపు ప్రయాణం. ఇప్పటికే మదనపల్లె ను కడప జిల్లాలో చేర్చడం వల్ల మదనపల్లె ప్రజలు లబోదిబోమంటున్నారు.

మదనపల్లి నుంచి కడపకు వెళ్లి రావడానికి ఒక రోజు ప్రయాణం అవుతుందని మదనపల్లె ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమను చిత్తూరులో కలపాలని వారు కోరుతున్నారు కూడా. ఈ నేపథ్యంలో పుంగనూరును అన్నమయ్య కడప జిల్లాలో చేరుస్తూ అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ ప్రభుత్వ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల అభ్యంతరాలను తెలియజేయాలని కోరుతూ మదనపల్లి సబ్ కలెక్టర్ పుంగనూరు రెవెన్యూ కార్యాలయాలు ప్రభుత్వ నిర్ణయాన్ని నోటీసు బోర్డులో ఉంచాయి. ప్రజలను సంప్రదించకుండా ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా ఏకపక్షంగా పుంగనూరును కడప జిల్లాలో కలిపేస్తూ ఆదేశాలు జారీ చేసి అసాధారణ గెజిట్ పబ్లిష్ పట్ల ప్రజలు ఉడికిపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కడప జిల్లాలో పుంగనూరు చేరేందుకు అంగీకరించమని సమైక్యాంధ్ర ఉద్యమం తరహాలో పుంగనూరు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లాలోనే ఉంచాలని ఉద్యమించడానికి సిద్ధపడుతున్నామని ప్రజా ప్రభుత్వ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# కాణిపాకంలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ

**దర్శనానికి నాలుగు గంటల సమయం**



కాణిపాకం, మే 24 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయంలో శనివారం భక్తుల వేసవి రద్దీతో పోటెత్తింది. సాధా రణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివా రాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయి లో రద్దీ వుంటుంది. ఈమేరకు శనివారం వారాం త పు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు, పాఠశా లలకు సెలవులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శ నార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని

# కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా కల్యాణోత్సవం



నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :
నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలా డింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11గంటలకు స్వామి అమ్మవార్లకు ఘనంగా కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా స్త్రీ శక్తి భవనాలు...!



అసంపూర్తిగా స్త్రీ శక్తి భవనాలు

కేవీబీ పురం, మే 24 ప్రభాతవార్త:
మహిళా సాధికారతను సాధించే దిశగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2011లో స్త్రీ శక్తి భవనాన్ని నిర్మించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద దీని నిర్మాణానికి నిధులను మంజూరు చేసి ఈ భవనం నుంచే మహిళ సంఘాలు సభ్యులు, ఉపాధి పథకం కార్యక్రమాలను సాగించాలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ భవనాల నిర్మాణానికి సుమారు 25 లక్షల రూపాయల నిధులను కేటాయించిన ప్రభుత్వం వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా గుత్తేదారులపై ఒత్తిడి తెచ్చి పూర్తి చేయించే పనిలో పడ్డారు. అయితే సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం, నాగలాపురం మండలాల్లో మాత్రం అందుకు భిన్నంగా 14 సంవత్సరాలు గడిచినా అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

**పునాదులకే పరిమితం**

సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం మండల కేంద్రంలో ఆర్భాటంగా స్త్రీ శక్తి భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే హేమలత అట్టహాసంగా భూమి పూజను ప్రారంభించారు. అయితే దీని నిర్మాణం పునాదులకే పరిమితం అయింది. దీని నిర్మాణం గురించి ప్రజాప్రతినిధులు కాని అధికారులు కాని ఎలాంటి ప్రయత్నం చేసిన పాపాన పోలేదు. ఇక్కడి ఉపాధిహామీ పథకం వెలుగు కార్యకలాపాలు ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోనే నిర్వహించుకోవలసిన దుస్థితి నెలకొంది.

**కనీస వసతులకు మహిళల పాట్లు**

నియోజకవర్గంలోని కేవీబీ పురంలో నిర్మించిన స్త్రీ శక్తి భవనంలో కనీస సౌకర్యాలు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 80 శాతం భవన నిర్మాణం పూర్తి చేశామని అధికారులు చెబుతున్న అక్కడికి వచ్చే మహిళలకు కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం తాగేందుకు చుక్కనీరు దొరక్క పక్కనే ఉన్న ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం వద్దకు బాధితులు పరుగులు తీస్తున్నారు.

# వైకాపా పాలనలో భూ ఆక్రమణలు.. అరాచకాలే

**శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి**



శ్రీకాళహస్తి, మే 24 ప్రభాతవార్త
వైకాపా ఐదేళ్ళ పాలనలో పుణ్యక్షేత్రం భూ ఆక్రమణల ఆరాచకాలు నిలయంగా మారిందని కొందరు అధికారులు విచ్చలవిడిగా అప్పటి శాసన సభ్యునికి సహకరించి పేదల భూములను సంతర్పణ చేసారని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి శివమెత్తారు. శనివారం ఇక్కడి పంచాయతీరాజ్ అతిథి గృహంలో 'ప్రజా దర్బా ర్‌ను' నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన వందలాది అర్జీల్లో 80శాతం గ్రామాల్లో భూ సమ స్యలకు సంబంధించినవే కావటం విశేషం. ప్రజా దర్బార్ లో వచ్చిన అర్జీలలో చిన్న చిన్న సమ స్యలను ఆర్థికంగా సంబంధం లేని సమస్యలను వెంటనే పరిష్కరించాలనిఅధికారును ఆదేశిం చారు.

**సుధీర్‌కు పోస్టింగ్ ఇవ్వొద్దు: సబ్‌రిజిస్ట్రార్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు?**

శ్రీకాళహస్తి మండలం తహశీల్దార్ కార్యాలయాన్ని వైకాపా పాలనలో డెప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అలాంటి అధికారికి మళ్ళీ పోస్టింగ్‌లు ఇవ్వటం తగదన్నారు. అలాంటి ఉద్యోగుల సేవల్ని కలెక్టర్ కార్యాలయంలో ఉపయోగించుకోవాలని ఎంఎల్ఏ వివరించారు. నేడు వచ్చిన సమస్యల్లో రాచగున్నేరికి చెందిన ఓ వైసిపి నాయకుని ఇల్లు అమ్ముకు న్నారు. నాలుగేళ్ళలో ఇల్లు స్వాధీనం చేయలేదు. ఇలాంటి అరాచకం మరొకటి ఉంటుందా? అని ప్రశ్నించారు. మరో సమస్య 20 సంవత్సరాల పాలనలో ఓ భూమి ఒకరి పేరు మీద ఉంటే దానిని మరొకరి పేరు మీద మార్చేసారు. రికార్డుల్లో పేర్లు మార్చేసారు. వైకాపా పాలనలో సుధీర్‌రెడ్డి శాసన సభ్యుని మద్దతుతో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. కాగా తొట్టంబేడు సబ్‌రిజిస్టర్ కార్యాలయాధికారి అవినీతిపై ప్రజల ఫిర్యాదుతో తాను పరిశీలించి ఆయన తీరులో మార్పు తీసుకు రావాలని డిమాండ్‌చేసానన్నారు. ఆతన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసానన్నారు. ఈ అధికారుల తీరును ఉన్నతాధికారుల దృష్టికి, మంత్రుల దృష్టికి తెచ్చానని, అయితే చర్యల్లేవని జాప్యం వల్ల జనం తాను రాజీపడినట్లు భావిస్తారని వివరించారు.

## తప్పనిసరిగా మాస్కులు వాడాలి

– తాసిల్దార్ రమేష్ బాబు

పూతలపట్టు, మే 24, ప్రభాతవార్త

కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అందరూ తప్పనిసరిగా మాస్కులు వాడాలని తాసిల్దార్ రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కార్యాలయాలు జనం అధికంగా గుమ్మికూడే బస్టాండు, రైల్వే స్టేషన్, షాపింగ్ మాల్, వివాహాలు శుభకార్యాలు, సినిమా హాలు, ఆలయాలు, వారపు సంత లాంటి ప్రాంతాలలో మాస్కులు తప్పనిసరిగా వాడాలన్నారు. బహిరంగ సామాజిక సమావేశాలు వాయిదా చేసుకోవాలన్నారు ప్రతి ఒక్కరూ కోవిడ్ 19 నిబంధనలు పాటించాలన్నారు.

## రోసి నాయుడుకు అశ్రునయనాలతో నివాళులు...

రేణిగుంట, మే 24 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ వీరాభిమాని కార్యకర్త గజేంద్ర తండ్రి రోసినాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి శనివారం తీవ్ర సంతాపం తెలియజేశారు. ఆయన భౌతిక కాయాన్ని రిషితా రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. గజేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతోపాటు నివాళులు అర్పించిన వారిలో రేణిగుంట టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి నాయకులు తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, కన్నన్ రెడ్డి, కొరియర్ రవి, తదితరులు ఉన్నారు.

## మాజీ సర్పంచ్ కుమారుడి మృతికి నివాళులు

.తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త



మండలంలోని కొమ్మనగుంట గ్రా మం మాజీ సర్పంచ్ పార్వతమ్మ కుమారుడు కీ.శే.డాక్టర్ మధు సూధన్ అనారోగ్యంతో మృతిచెం దారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధు సూధన ఒడ్డి, శ్రీకాళహస్తీ శ్వరాలయ మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మండల ఎంపిపి ఉన్నం నిర్మలవాసు దేవనాయుడు, స్వర్ణమూర్తి, మాజీ పాలకమండలి సభ్యులు సాధనమున్నారాయల్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాజిశరవణకుమార్, కంటా ఉదయ్, మొగరాల గణేష్, కోళ్ళూరుహరనాధనాయుడు, వెంకటేశ్వర్లు, గఫూర్, వేలూరు రమేష్ విజయకుమార్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

**ప్రియాబుక్‌స్టాల్ అధినేతకు నివాళులు..**

పట్టణంలోని కొత్తపేటలో ఎప్పటి నుంచో అందరికి సుపరిచయమైన ప్రియా బుక్‌స్టాల్ అధినేత కీ.శే.శెంజి గరంవేలు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు కొమ్మనగుంటలోని ఆయన స్వగృహానికి చేరుకుని మృతిచెందిన వేలుకు నివాళులు అర్పించి మాజీ కౌన్సిలర్ సుప్రజను ఓదార్చారు. కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

**మాజీ ఎంఎల్ఏ కుమారుడు పరామర్శ..**

మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు కుమారుడు ఎస్సీవీ దిలీప్ మాజీ కౌన్సిలర్ సుప్రజ భర్త శెంజిగరం వేలు ఆకస్మికంగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు కుమారుడు ఎస్సీవీ దిలీప్ వేలు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలిపారు.

## మద్యం బెల్టుషాపుల మీద పోలీసులు మెరుపు దాడులు

నాగలాపురం, మే 24 ప్రభాతవార్త:

నాగలాపురం మండలం కడివేడు గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కడివేడు గ్రామంలో శంకరయ్య ఇంట్లో బెంగళూర్ బ్రాంది 180 ఎంఎల్ 10 బాటిళ్ళ ఉండడంతో నాగలాపురం ఎస్ఐ సునీల్ శంకరయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు

మహిళకు స్వల్ప గాయాలు

పుత్తూరు రూరల్, మే 24 ప్రభాతవార్త:



మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన శనివారం రాత్రి పుత్తూరు పట్టణంలో జరిగింది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... తిరుపతి నగరం కొర్లవీధికి చెందిన కల్యాణి(55) పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యుత్ మోటార్లు దుకాణం నిర్వహిస్తోంది. శనివారం రాత్రి దుకాణం మూసేసి తమ్ముడు శ్రీరామ్‌తో పాటు ద్విచక్రవాహనంపై తిరుపతి వెళుతుండగా పుత్తూరు పై వంతెనపై అదే వైపు ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు కల్యాణి మెడలో ఉన్న బంగారు చైన్‌ని లాక్కెళ్లారు. ఈ సమయంలో ఆమె కిందపడిపోవడంతో స్వల్పగాయాలు అయ్యాయి. వాహనం నడుపుతున్న తమ్ముడు ఎవరో ద్విచక్రవాహనంను ఢీకొన్నట్లు పక్కకు నిలిపాడు. అప్పటికే ఆమె కింద పడిపోయి ఉండడంతో పైకి లేపి ఏమీ జరిగిందో తెలుసుకున్నాడు. మెడలో ధరించిన 16 గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లినట్టు చెప్పింది. వెంటనే ఆమెను పుత్తూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేత్ర చికిత్సలకు 35 మంది ఎంపిక

పుంగనూరు రూరల్, మే 24, ప్రభాతవార్త



తాటిమకులపాళ్యంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి సమస్యతో శిబిరానికి వచ్చిన వారికి శంకర్ నేత్రాలయ హాస్పిటల్ నుండి విచ్చేసిన డాక్టర్ మురళీకృష్ణ కంటి పరీక్షలు నిర్వహించారు. తర్వాత 35 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ

శ్రీకాళహస్తి, మే 24 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష ఐ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం స్థానిక తెలుగుగంగ కాలనీలో ఉన్న ఏపిటిడబ్ల్యుఆర్ఎస్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విభిన్న ప్రతిభావంతులు ప్రత్యేక శిక్షణ కోసం మంజూరు చేసినటువంటి ఆటిజం సెంటర్‌కు అవసరమైనటువంటి తరగతి గదులు, టాయిలెట్స్ రవాణా సౌకర్యం తదితర వాటి గురించి పరిశీలించారు. ఎంఈఓ బాలయ్య మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యంతో ఆటిజం సెంటర్ గురించి చర్చించారు. అనంతరం నిర్వహిస్తున్న సిడబ్ల్యుసిఎస్ సర్వేను సందర్శించడం జరిగింది. జూన్ 9వ తేదీ వరకు విభిన్న ప్రతిభావంతుల డోర్ టు డోర్ సర్వే భవిత కేంద్రాల సిబ్బంది నిర్వహిస్తారు. ఒకటి నుంచి 18 ఏళ్ళ వయస్సు ఉన్న ప్రత్యేకావసరాలు గల పిల్లలు బడిలో చేరకుండా ఇంటి వద్దనే ఉంటున్న వారిని గుర్తించి వారికి బడిలో నమోదు చేయించడం జరుగుతుందని ఐ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 బాలయ్య, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సిఎం చంద్రన్న గృహప్రవేశానికి ఆహ్వానాలు

కుప్పం, మే 24 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు శాంతిపురం మండలం శివపురం వద్ద సొంత ఇల్లు నిర్మించిన విషయం విదితమే. ఆదివారం సిఎం కుటుంబీకులు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి కుప్పం నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరూ గృహ ప్రవేశానికి హాజరై ముఖ్యమంత్రి దంపతులను, కుటుంబీకులను ఆశీర్వదించాలని కోరుతూ ముఖ్యమంత్రి కుటుంబీకుల తరపున తెలుగుదేశం పార్టీ నేతలు కుప్పం నియోజకవర్గంలో నేరుగా ఆహ్వాన పత్రికలు తీసుకెళ్లి ప్రజలను ఆహ్వానిస్తున్నారు. పండగ వాతావరణంలో సిఎం నివాస గృహ ప్రవేశ కార్యక్రమం జరుగుతోంది. ఆయా గ్రామాల్లో ముఖ్య నేతలు, స్థానిక నేతలు కలసి వెళ్లి ప్రజలను గృహ ప్రవేశానికి ఉత్సాహంగా ఆహ్వానిస్తున్నారు.

## యోగాతో ఆరోగ్యం..మానసికోల్లాసం

– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మే 24 ప్రభాతవార్త




యోగాతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం సాధ్యమవుతుందని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వైజాగ్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు. నెలరోజుల పాటు మన రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## భవిష్యత్తు సమస్యల పరిష్కారం ఒఐటి

– కెఇసి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు

కుప్పంరూరల్, మే 24 ప్రభాతవార్త



భవిష్యత్తులో సమస్యల పరిష్కారంకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. కెఇసిలో వారం రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐఒటితో ఎన్నో లాభాలు ఉన్నా యన్నారు. మానవ ప్రమేయం లేకుండానే పరికరాలు, వస్తువులు వాటికవే సమాచారంతో పంపించ వచ్చన్నారు. దీంతో నాణ్యమైన సేవలు పొందే అవకాశం ఉందన్నారు. బిగ్ డేటా, మెషిన్ లెర్నింగ్‌లలో సైతం ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిటి అకాడమీ టెక్నికల్ ట్రైనర్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, పిఒ డా॥ జయకుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడి అధికమించడానికి యోగా

– ఆర్డీఓ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, మే 24 ప్రభాతవార్త:



మానసిక ఒత్తుడులు, ఆరోగ్య సమస్యలను అధికమించడానికి ప్రతి ఒక్కరు యోగా చేయాలని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో శనివారం యోగాంధ్రా మాసోత్సవాలు పురస్కరించుకుని యోగా కార్యక్రమాలను ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎస్పీ సాయినాథ్, పర్యాటక శాఖ అధికారి గౌరీ, డిఎస్‌డిఓ బాలాజీ, వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ తదితరులు పాల్గొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోడి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీ సర్కిల్‌లో సైతం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. యోగా ద్వారా ప్రతి ఒక్కరు రోజువారీ ఎదుర్కొనే మానసిక ఒత్తిడులు, ఆరోగ్య సమస్యలను అధికమించవచ్చునన్నారు. మానసిక ఆరోగ్యం పరిరక్షించుకోవడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ రోజు వారి ప్రణాళికలో యోగాకు సమయం కేటాయించి ఆరోగ్యంగా వుండాలన్నారు. డిఎస్పీ సాయినాథ్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఉపశమనం కలుగుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి ఎద్దైనా వుంటే యోగాతో వెళ్ళిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, యోగా గురువులు బాబు, రాజేంద్ర, మున్సిపల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గ్రామదేవతల తిరునాళ్ళు

గుడిపాల, మే 24 ప్రభాతవార్త:



మండల పరిధిలోని రామభద్రాపురం చుక్కావారిపల్లిలో శనివారం శ్రీ సెల్వి వినాయకస్వామి గ్రామ దేవత పొన్నియమ్మ తిరునాళ్ళను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మహాకుంభాభిషేకం, గణపతిహోమం, పూర్ణాహుతి హోమం, కుంభాభిషేకం నిర్వహించి పొంగళ్ళు ఇతర నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు ఆధ్వర్యంలో తిరుణాల పూలు వేసిన అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, బాణాసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా స్వామి, అమ్మవార్లకు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తండ్రి గురజాల చెన్నకేశవులునాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, సుమతి మురళీ నాయుడులు, ఎంపిటిసీ హరిప్రసాద్, మాజీ సర్పంచ్ పయణి, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండలంలో దివ్యాంగుల సర్వే నిర్వహించండి

తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త



సమగ్ర శిక్ష కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఏడాదివలె ఈఏడాది కూడా 1-18 సంవత్సరాలు కలిగిన వారు 21 వైకల్యాలతో కూడిన దివ్యాంగుల పిల్లలు మండల పరిధిలో ఎక్కడెక్కడ ఉన్నారో సర్వేచేసి బడి బయట లేకుండా దివ్యాంగులను పాఠశాలలో చేర్పించడం వారికి ఏ విధమైన సదుపాయాలు అవసరమో తెలుసుకుని దానికి తగిన విధంగా సదరన్ సర్టిఫికెట్లు లేని చిన్నారులకు ఇప్పించడం, భవిత కేంద్రాలకు ప్రత్యేక విద్యా సదుపాయాలు గురించి తల్లిదండ్రులకు తెలియజేయడం వంటి కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మండలంలోని చిలకావారి కండ్రిగ గ్రామంలో సర్వే తనిఖీ చేయడం జరిగింది. దివ్యాంగుల పిల్లలకు ఎలాంటి సదుపాయాలు సమగ్ర శిక్ష ద్వారా నిర్వహించబడుతుందో తల్లిదండ్రులకు తెలిపారు. కార్యక్రమంలో మండల సహిత విద్య ఉపాధ్యాయులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాజనాలబండపై సత్యప్రమాణాల జోరు



చౌడేపల్లి, మే 24 ప్రభాతవార్త

సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ శనివారం ప్రమాణాలు చేసేవారితో కిక్కిరిసి పోయింది. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసన్న ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకరణగావించారు. బండకు వచ్చిన కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. స్థానికులు భక్తులు సేవలందించారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం : పరిస్థితి విషమం

చౌడేపల్లి, మే 24 ప్రభాతవార్త



ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంటకు చెందిన శేఖర్(26) డ్రైవర్ పనిచేసుకొంటూ జీవిస్తున్నాడు. అతని తండ్రి మణి 3నెలల క్రితం అనారోగ్యంతో చెందాడు. ఈక్రమంలో కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా మనస్థాపానికి గురైన శేఖర్ ఇంట్లోకి వెళ్ళి దూలానికి తాడుతో ఉరేసుకొన్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఇక్కడ ఆరోగ్య పరిస్థితి విషయమించడంతో 108సేవల ద్వారా మదనపల్లికి అటు నుంచి తిరుపతి రుయాకు తరలించారు. శేఖర్ కోమాదశలో వున్నట్లు వైద్యులు ధృవీకరించారు.

## ఇళ్ళల్లోకి మురుగు నీరు వచ్చేస్తున్నాయ్...!

-పారిశుధ్ధ్య చర్యలు చేపట్టండి సారూ...



***చౌడేపల్లి, మే 24 ప్రభాతవార్త*** ఇళ్ళల్లోకి మురుగునీరొస్తున్నాయి పారిశుధ్ధ్య చర్యలు చేపట్టండి మహా ప్రభో...అంటూ కాలనీ మహిళలు కోరుతున్నారు. మండల కేంద్రమైన చౌడేపల్లి పాత పోలీస్‌స్టేషన్ వెనుకనున్న కాలనీలో మురుగునీటి కాలువలు లేవు. అంతే కాకుండా కెటివీధి నుంచి టీచర్స్ కాలనీ మీదుగా వున్న రాజుకాలువ ద్వారా చౌడేపల్లి పెద్దచెరువులోకి మురుగు నీరు వెళుతుండేవి. అయితే రాజుకాలువ దురాక్రమణకు గురికావడం, పూడ్చేయడంతో నివాస గృహాల్లోకి మురుగునీరు వచ్చేస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఈ విధంగా వుందంటే ఇక వర్షాకాలం వస్తే ఇళ్ళు ఖాళీ చేయాల్సిందేనంటున్నారు. మురుగునీరు నిల్వ వున్నందును రోగాల బారిన పడుతున్నామనీ, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి రాజుకాలవను దురాక్రమణదారుల నుంచి కాపాడి, పూడిక తీయించాలని మహిళలు అధికారులతో మొరపెట్టుకొంటున్నారు.

## మణికంఠేశ్వరాలయంలో ఘనంగా ప్రదోషకాల పూజ

కాణిపాకం, మే 24 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాయలంలో శనివారం ప్రదోషకాల పూజలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా ఆలయంలో త్రయోదశి రోజున ప్రదోష కాల సమయంలో మణికంఠేశ్వరాలయంలో ప్రదోష కాల పూజలను నిర్వహిస్తున్నారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఆలయంలో ప్రదోష కాలమందు ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె,పెంచల కిషోర్, అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళలు నిండు మనసుతో సిఎంను ఆశీర్వదించాలి

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

– శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ఉచితంగా చీరలు పంపిణీ !!

కుప్పం, మే 24 ప్రభాతవార్త



మహిళలు నిండు మనసుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. శనివారం కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో పేద మహిళలకు ఉచితంగా ఆలయం తరపున చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి సాధారణమైన చీరలు కావని అమ్మవారికి సమర్పించిన వస్త్రాలను మహిళలకు ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకు అగ్రస్థానం వేస్తున్నారన్నారు. ఆదివారం శాంతిపురం మండలం శివపురం వద్ద సిఎం చంద్రబాబునాయుడు నూతన స్వగృహ ప్రవేశానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, సిఎం పిఎ మనోహర్, రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కమిటీ సభ్యులు జయరాంనాయుడు, శారదమ్మ, నరేష్, వినయ్, పవన్ మహేష్, కౌన్సిలర్ జిమ్‌దాము, నేతలు మంజు, సుగుణమ్మ, నవనీత, గీతమ్మ పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు చిత్రపటానికి డీలర్లచే పాలాభిషేకం

కుప్పం, మే 24 ప్రభాతవార్త




సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి కుప్పం మండల చౌకదుకాణ డీలర్లు పాలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్సీ హయాంలో ఉన్న ఎండియు వాహనాలను రద్దు చేసి పాత విధానంలోనే డీలర్లు ప్రజలకు నేరుగా నిత్యావసర సరుకులు తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ డీలర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సిఎం చంద్ర బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స ం ఘఅధ్యక్షుడువేణుగోపాల్, నేతలు మునిరత్నం, రమేష్, లీలా వెంకటేష్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తిరుపతి హెల్త్, మే 24 ప్రభాతవార్త ః



అంబులెన్స్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి గురవయ్య, మెడికల్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మహేంద్ర, శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గోపి విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి నందు అంబులెన్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధంతో స్టాండ్‌ను ప్రారంభించిన సందర్భాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అనాధ శవాలకు ఉచిత సేవలు అందిస్తున్న అంబులెన్స్ డ్రైవర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి వారిని ప్రభుత్వం కూడా అంబులెన్స్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు చేయాలని, 50 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్,ఈఎస్ఐతో కూడా సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్ భాష, సుబ్రమణ్యం, ఎస్.కె చానా జానీకర్, ఏఐటీయూసీ నియోజక వర్గ అధ్యక్షులు మురళీ, ఏఐఎస్ఎఫ్ ములిచిందు మునీ చందు, కాలేషా వేదం శేశర్, దుర్గా పెళ్ళూరు శివ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, మే 24, ప్రభాతవార్త

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షల కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేది ఆదివారం నగరంలోని 13 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలు జరగనున్నాయన్నారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో జరుగుతాయని అన్నారు. ఉ. 9.30 నుండి ఉ. 11.30, వరకు మ. 2.30 నుండి మ.



4.30 వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా సంతోషంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు ఉండాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్,గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్,డిఈలు, శానిటరీ సూపర్ వైజర్లు తదితరులు ఉన్నారు

## చేనేత కార్మికులను ఆదుకునేది ఒక్క టిడిపి ప్రభుత్వమే!

శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త



సమాజంలోని చేనేత కార్మికులను అన్ని విధాల ఆదుకునే ప్రభుత్వం తెలుగుదేశమే అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం భాస్కరపేటలోని చామండేశ్వరి మండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్‌ఏ హాజరయ్యారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ పేదవాని స్వేదం నుంచి ఆవిర్భవించింది తెలుగుదేశం అన్నారు. కూడు,గుడ్డ, గూడు అనే సిద్ధాంతంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఈ నేపధ్యంలో నారాచంద్రబాబునాయుడు చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. నేడు చిన్నక్లస్టర్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్గిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు రాయితీలను ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి దశరధాచ్చారి, మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ మిన్నల్‌రవి,సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడకు తల్లి: అండగా నేనున్నా!

కన్నీటి పర్యంతమైన ఎంఎల్‌ఏ దంపతులు

తొట్టంబేడు,మే 24 ప్రభాతవార్త



అధైర్యపడకు తల్లి నేనున్నాను.ఆదుకుంటాను. అంటూ స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాజీ కౌన్సిలర్ సుప్రజను ఓదార్చారు. సుప్రజ భర్త తెలుగుయువతలో పని చేసిన సెంజిగారం వడివేలు(55) ఆకస్మికంగా మరణించారు. ఆయన మృతికి సంతాపంగా నివాళులర్పించుటకు శనివారం మండలంలోని కొమ్మన గుంట రాజకీయ నాయకులతో నిండింది.గ్రామం కన్నీటి సంద్రమైంది. శనివారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దంపతులు అంత్యక్రియలకు హాజరయ్యారు. వారు సుప్రజను పట్టుకొని బోరును ఏడ్చారు. నీ కుటుంబానికి నేనున్నానని ఎంఎల్‌ఏ భరోసా ఇచ్చారు. ఆది నుంచి సెంజిగారం కుటుంబం తెలుగుదేశం పార్టీకి నమ్మకమైన కార్యకర్తలుగా ఉన్నారు. వేలు భార్య సుప్రజ ఐదేళ్ళ పాటు 9వ వార్డు కౌన్సిలర్‌గా ఉంటూ వార్డును ప్రగతి పథంలో నడిపారు.ఈ సందర్భంగా మృతదేహంపై తెలుగుదేశం జెండాను ఉంచి నివాళులర్పించారు.

***అంత్యక్రియల్లో దేశం వర్గాలు:***

వడివేలు అంత్యక్రియల్లో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డితో పాటు మండల తెలుగుదేశం నాయకుడు రావిళ్ళ మునిరాజానాయుడు,మాజీ అధ్యక్షుడు మురళి నాయుడు,బొల్లినేని జగన్నాధం నాయుడు,పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,రంగినేని చెంచయ్యానాయుడు,కన్నలి ప్రతాప్‌రెడ్డి,దుర్గా ప్రసాద్, యువ శేఖర్,కామేష్‌యాదవ్,ఉమేష్‌రావు,నెమళ్ళూరుబుజ్జి,ఢిల్లిబాబుపట్టణానికిచెందినమాజీ కౌన్సిలర్లు, తెలుగు దేశం కుటుంబసభ్యులు హాజరయ్యారు.

## కైలాష్ ధామంకు "ఇటుకలు వితరణ"

ఎంఎల్‌ఏ పిలుపుతో బ్రిక్స్ యజమానుల స్పందన

చంద్రగిరి, మే 24 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరిలో కైలాష్ ధామం నిర్మాణంలో తాము సైతం భాగస్వాములమవుతామని ఎస్‌బిబి బ్రిక్స్ అధినేత, ఇటుకల బట్టీల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.చౌదరి ముందుకు వచ్చారు. చంద్రగిరి మండల ప్రజల సౌకర్యార్థం చరిత్ర గుర్తుంచుకునే రీతిన ఎంఎల్‌ఏ పులివర్తి నాని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కైలాష్ ధామం నిర్మాణ పనులకు దాతల నుండి సహాయ సహకారాలను కోరారు. ఆ మేరకు మండలంలోని అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.చౌదరి ఆధ్వర్యంలో బట్టీల యజమానులు శనివారం కైలాష్ ధామంను సందర్శించారు. ఈ సందర్భంగా కె.వి.చౌదరి మహాప్రస్థానం కమిటీ పెద్దలతో మాట్లాడుతూ కైలాష్ ధామం నిర్మాణం కొరకు తమవంతు వితరణగా ఇటుకలను అందించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఏ పులివర్తి నాని, కమిటీ అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి, కార్యదర్శి నాగరాజ నాయుడు, కోశాధికారి ఓంకార్ భరద్వాజ్, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ సిఈఓ సంగీతం విశ్వనాథ్, ప్రకాష్ రెడ్డి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నాగేంద్రబాబు మృతి

నివాళులర్పించిన పులివర్తి వినీల్

చంద్రగిరి, మే 24 ప్రభాతవార్త:



ఆరేపల్లి రంగంపేట పంచాయతీ, కృష్ణాపురంకు చెందిన టిడిపి కార్యకర్త నాగేంద్రబాబు ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ శనివారం ఇక్కడికి చేరుకుని నాగేంద్రబాబు భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏజి పల్లి బాల, లోకాద్రి నాయుడు, దేవీలాల్, భూపతి రాయల్, చైతన్య, కుమ్మరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## దర్గాను దర్శించుకున్న రెడ్ శాండిల్ ఎస్పీ

శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పానగల్‌లోని దర్గామిట్టలో వెలసిన హజరత్ జునలేషా పీర్ దర్గా దర్శనార్థం తిరుపతి జిల్లా రెండ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ విచ్చేసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్‌ను సమర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జునలేషాపీర్ దర్గా తమ సామరస్యానికి ప్రతీకగా ఉందని ఎంతో ప్రశాంతమైన వాతావరణం మనసు చాలా ప్రశాంతంగా ఉందని తెలిపారు. అనంతరం దర్గా నిర్వాహకులు ఎస్పీకి తీర్థప్రసాదాలు అందించి దర్గా యొక్క విశిష్టను తెలిపారు. కార్యక్రమంలో దర్గా ఉరుసు కమిటీ అధ్యక్షులు వి.నాగేశ్వరరావు, సభ్యులు మహ్మద్, అన్సర్, దర్గా మజిద్ ఇమాం మౌలానా, సాజిదులు, ఖాదరి, యాకూబ్, రహీంఖాన్, బావజాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ

నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :

వికలాంగులకు కృత్రిమ జైపూర్ వారి ఉచిత అవయవాలను అందించడం జరుగుతుందని లక్కీస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సాయిరాం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టకతో గానీ, ప్రమాదంలో అవయవాలను కోల్పోయిన వికలాంగులకు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా అదించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన వారిని గుర్తించి తర్వాత అవయవాలను అర్పడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు తమ ప్రతినిధి వంశీ 7729044987ను స ంప్రదించాలని కోరారు.

## స్విమ్స్‌లో బీసీలకు న్యాయం చేయండి

- డాక్టర్ నారాయణ గౌడ్

తిరుపతి హెల్త్, మే 24 ప్రభాతవార్త ః



ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్వూరు నారాయణ గౌడ్ స్విమ్స్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.వి కుమార్‌ను కలిసి స్విమ్స్‌లో రిజిస్ట్రార్, డీన్ తదితర పదవులలో బీసీలను నియమించాలని వినతి పత్రం అందజేశారు. డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ రాయలసీమకే తలమానికమై నిత్యం వందలాది మంది రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్న స్విమ్స్ దేశంలోని విశిష్టమైన గుర్తింపు కలిగి ఉన్నదని కానీ కీలకమైన పరిపాలన పదవులలో బీసీలు లేక పోవడం చాలా బాధాకరమని తెలిపారు. త్వరలో నియమించబోయే కీలమైన పరిపాలన పదవుల్లో అర్హులైన బీసీలను నియమించి సామాజిక న్యాయానికి పాటుపడాలని కోరారు.

## వైభవంగా నంది ప్రదోషం పూజలు

పుత్తూరు రూరల్, మే 24 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నంది ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామికి అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలను కూడా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడికి విశేషాలు చేశారు. నంది వాహనంపై శ్రీ కామాక్షిసమేత స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలు నడుమ ఆలయ ప్రదక్షిణం కార్యక్రమాన్ని చేశారు. భక్తులు అధిక సంఖ్యలోహాజరై స్వామివారికి, అమ్మవారికి మంగళ హారతి ఇచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలపై పుత్తూరులో ఆపస్ హెల్ప్ డెస్క్

పుత్తూరు రూరల్, మే 24 ప్రభాతవార్త:



నిరంతరం ఉపాధ్యాయుల సేవలో ఎల్లవేళలా అందుబాటు లో ఉంటూ సమస్యల పరిష్కారంలో కాని, పోరాటాల్లో కాని ఉపాధ్యాయుల పక్షాన నిలబడు తూ నిరంత రం అధికారులను సంప్రదిస్తూ నిష్పక్షపా తంగా సాధారణ ఉపాధ్యాయుడి హక్కు కోసం ఎల్లప్పుడూ ముందుండే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జరగబోవు బదిలీలకు సంబంధించి హెల్ప్ డెస్క్ పుత్తూరులో ఏర్పాటు చేయడం జరిగింది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి అందరు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, ఆన్‌లైన్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోగలరు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 వరకు సాయంత్రం 4 నుంచి 8 వరకు బదిలీల కార్యక్రమం తుది దశ వరకు అందుబాటులో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు దొరస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, నాయకులు చక్రపాణి, గుర్రప్ప, మాండవ్య మొదలైన వారు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## మా భూమి మాకు ఇప్పించండి

- బాధితురాలు సంపూర్ణమ్మ

తిరుపతి హెల్త్, మే 24 ప్రభాతవార్త ః



మా భూమిని కబ్జా చేశారూ...! న్యాయం చేసి మా భూమి మాకు ఇప్పించండని ఎస్పీని బాధితురాలు సంపూర్ణమ్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు సంపూర్ణమ్మ మాట్లాడారు. 1981లో సుబ్రమణ్యం రాజు నుంచి మున్సిపాలిటీ పరిధిలోని ఉపాధ్యాయ నగర్‌లో 12.05 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రర్ చేసుకోవడం జరిగిందన్నారు. ఇదే స్థలాన్ని 2005లో కొంత మంది క్రైస్తవులు కొనుగోలు చేసినట్లు గతంలో కొంత మంది రౌడీ మూకలతో వచ్చి బెదిరించడం జరిగిందన్నారు. అయితే వామపక్షాల అండతో ఆ భూమిని మాకు ఇప్పించిడం జరిగిందని, అయితే ఈ నెల 22వ తేది తిరిగి 30 మంది రౌడీ మూకలు వచ్చి మమ్మల్ని బెదిరించి మా స్థలంలో ఉన్న షెడ్లను పూర్తి నేలమట్టం చేసి ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ ల్యాండ్‌కు సంబంధించి మా అల్లుడు సుకుమార్‌ను అక్రమంగా అరెస్టు చేసి జైలు పాలు చేశారని బాధపడ్డారు. వెంటనే రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయ చేయాలని బాధితురాలు సంపూర్ణమ్మ ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు కుమారై నీరజ, పరమానంద పాల్గొన్నారు.

## రాష్ట్ర గిరిజన సలహాదారుగా సుబ్బయ్య

శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త



రాష్ట్ర గిరిజన సలహామండలి సభ్యుడుగా మాసారపు సుబ్బయ్య ఎన్నియ్యారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన్ను శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సత్కరించారు. సలహామండలి నియామకంలో భాగంగా ప్రతిపాదనలు కోరినపుడు శాసనసభ్యుడు సుబ్బయ్య పేరును ప్రతిపాదించారు. సిఫార్సు ఉత్తరాన్ని ఇచ్చారు. గత వైకాపా పాలనలో సుబ్బయ్యపై అక్రమకేసులు బనాయించారు. ఇబ్బందులు కల్గించారు. ఈ నేపధ్యంలో ఆయనకు కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు.ఈ నేపధ్యంలో గిరిజన సలహా మండలి సభ్యుడయ్యారు. సన్మానంలో మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడులు పాల్గొన్నారు.

# పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

శ్రీకాళహస్తిరూరల్, మే 24 ప్రభాతవార్త



పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం అని ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల సమన్వయ కర్త శిరీష అన్నారు. శనివారం బండారుపల్లి పంచాయతీలో రాజుల పాళెం గిరిజన కాలనీలో గిరిజన తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో శిరీష మాట్లాడుతూ పిల్లల భావితరాలకు సమాజంలో అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రులు పిల్లలకు ఆరోగ్యకరమైన సృజనాత్మకమైన స్థిరమైన మార్పును అన్ని స్థాయిలోనూ అందించాలని తెలిపారు. సాధికారిత గుర్తింపు ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవం స్వీయ బాధ్యత సమగ్ర అభివృద్ధి నాయకత్వంపై నైపుణ్యాలను పెంపొందించటం సానుకూల దృక్పథం సమస్యల పరిష్కారం నిర్ణయం తీసుకోవటం గురించి వివరించారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో అనేక సవాళ్ళు పిల్లల ప్రాథమిక అవసరాలు అహారం,దుస్తులు విద్య అందించటం వైద్యం భద్రత పిల్లల ఆర్థికంగా మద్దతు ఇవ్వటం భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల పాత్ర సమాజంలో మారుతున్న పరిస్థితులు అనుకూలంగా తీర్చిదిద్దాలని స్నేహితులతో స్వేచ్ఛ పిల్ల లహక్కులను అర్థం చేసుకోవటం విమర్శనాత్మకత ఆలోచన యాక్టివ్ క్రిటికల్ థింకింగ్ అవగాహన విద్యపై వారి నిర్ణయానికి పెద్దలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటేస్,మురగయ్య పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మంత్రి శ్రీనివాస్‌కు టిడిపి నేతల సన్మానం

తిరుపతి,మే 24ప్రభాతవార్త:



తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్రమంత్రి కె.శ్రీనివాస్‌ను పద్మావతి అతిధిగృహం వద్ద శనివారం తిరుపతి టిడిపి నేతలు కలిశారు. మంత్రిగా తిరుపతికి విచ్చేసిన ఆయనకు ఇన్‌ఛార్జి సుగుణమ్మ, టిడిపి నేతలు వట్టికుంట శంకరనారాయణ, బుల్లెట్‌రమణ, మునిశేఖర్‌రాయల్, కొట్టే హేమంత్‌రాయల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువతో సన్మానించారు.

## ఎమ్మెల్యేచే సిఎంఆర్ ఎఫ్ చెక్ పంపిణీ

తిరుపతి విద్య. మే 24 ప్రభాత వార్త



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధితునికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో అందించారు.ఐదవ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కు చెందిన మోహన్ కృష్ణా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్నారు.మధ్య తరగతికి చెందిన మోహన్ కృష్ణా అంత ఆర్థిక భారం మోయలేక సిఎంఆర్ ఎఫ్ కు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోగా ఏడు లక్షల రూపాయలు మంజూరైయ్యాయి.ఆ చెక్ ను బాధితుడు మోహన్ కృష్ణాకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఐదవ డివిజన్ అధ్యక్షులు పురుసోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పదిలో నారాయణ విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు

తిరుపతి విద్య మే 24 ప్రభాత వార్త



పదో తరగతి పరీక్షల పునర్మూల్యాంకనలో తిరుపతి ఎంఆర్ పల్లి నారాయణ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థిని జి.హృతి 600 మార్కులకు 599 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి పదవ తరగతి ఫలితాలలో 2వ ర్యాంక్ సాధించినట్లు ఆ విద్యాసంస్థల డీజీఎం కొండల రావు తెలిపారు. స్థానిక నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థి జి.హృతి 10వ తరగతి ఫలితాల్లో మొదట 596 మార్కులు సాధించగా,ఇంగ్లీష్ లో 97 మార్కులు వచ్చాయి. పునర్మూల్యాంకన అనంతరం ఇంగ్లీష్ పేపర్ లో 100 మార్కుల ద్వారా విద్యార్థిని 599 మార్కులతో రాష్ట్ర రెండవ ర్యాంకర్ గా నిలవటం ఎంతో సంతోషాన్నిచ్చింది అని తెలిపారు.అనంతరం విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఏ.మధు చంద్రుడు,స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో విద్యార్థికి మొదటి స్థానం

తిరుపతి విద్య మే 24 ప్రభాత వార్త



అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థా యిలో జీవ వైవిధ్యం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మదనపల్లి లో గల జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బీఎస్సీ బయోటెక్నాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని గుణ విజయ మొదటి స్థానంలో నిలిచారు.జిల్లా స్థాయి పోటీల్లో పద్మావతి డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని దీప్తి మొదటి స్థానం పొందారు.ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి గ్రీన్ క్రాప్ సంయుక్తంగా ఈ పోటీలు చేపట్టాయి. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులు గుణ విజయ,దీప్తిని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, యూనివర్సిటీ కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు.రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

గోవిందనామాలతో ప్రతిధ్వనింపు

తిరుపతి(రవాణ),మే 24ప్రభాతవార్త



శనివారం వేకువజామున ఆధ్యాత్మిక నగరం తిరుపతి గోవిందనామ స్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందించేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు తిరునామం ధరించి తప్పెటతాళాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## 27న ఉచిత బిఎండి క్యాంపు

తిరుపతి(రవాణ),మే 24ప్రభాతవార్త

సాయిసుధమల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 27వతేదీ మంగళవారం ఉదయం ఉచిత బిఎండి క్యాంపు జరుగుతుందని డాక్టర్ బి.సుకుమార్ తెలిపారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ ఉచిత వైద్యక్యాంపుకు యువత, వృద్ధులు, 40ఏళ్లుదాటిన వారు పాల్గొని ఉచిత వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7670 857048, 8500269500 నంబర్‌కు తెలియజేయాలని డాక్టర్ సుకుమార్ తెలిపారు

## కల్యాణ వేంకటేశ్వరుని సేవలో నెల్లూరు ఎమ్మెల్సీ

నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :



నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరున్ని నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చద్రశేఖర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఉదయం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టిటిడి అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు దర్శనం కల్పించిన తర్వాత కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వాదించారు. ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

## ఘనంగా పాలమంగళం ఉత్తరపుకండ్రిగ గంగ జాతర

నారాయణవనం, మే 24 ప్రభాతవార్త



మండలంలోని పాలమంగళం ఉత్తరుపుకండ్రిగలో రౌద్రాతి అంకమ్మ అమ్మవారు, గంగజాతర వేడుకలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమైనది. రెండవ రోజు శనివారం కన్నె పుట్టాలమ్మకు అంబళ్ల చెల్లింపు, అభిషేకం, అన్నదానం, గ్రామ ఉత్సవం, 25వతేది ఆదివారం జాతర చాటింపు, 26వ తేది సోమవారం అగ్నిగుండం, అంకమ్మ అమ్మవారు ఊరేగింపు, 27న రాత్రి 9గంటలకు కన్నె పుట్టాలమ్మ గుడి వద్ద భోగాతం ఆట జరుగును, 28న గ్రామ వీధుల్లో శక్తి అమ్మల చిత్ర పటాలు ఊరేగింపు, 29వతేది గురువారం నడివీధి గంగమ్మ స్థాపన, అమ్మవారి దర్శనం, నమజ్జనంతో ముగుస్తుందన్నారు.

# కైవల్యా నది ఒడ్డున నిర్మాణాలు ఆపండి

## -మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల మండి పాటు




వెంకటగిరి, మే 24, ప్రభాతవార్త : కైవల్యా నది ఒడ్డున బఫర్ జోన్‌లో సాగుతున్న నిర్మాణాలను ఆపాలని 16వవార్డు కౌన్సిలర్ రాధా అధికారులకు తెలిపారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలో ఉన్న విరుద్ధంగా చేస్తున్నట్లు తెలిపారు. పాత ఎమ్మార్వో కార్యాలయం పక్కన జోరుగా నిర్మాణాలు సాగుతున్నట్లు తెలిపారు. అధికారులు ఎందుకు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. వెంకటగిరి పురపాలక సంఘ కార్యాలయంలో చైర్పర్సన్ నక్క భానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. నాలుగో వార్డు కుమ్మరమెట్టలో కుక్కల సమస్య ఎక్కువగా ఉందని కౌన్సిలర్ ఎంఎ నారాయణ సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. కుక్కలు చిన్నపిల్లలను కరిచి ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. కుక్కల సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. ఎనిమిదో వార్డ్‌లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని వైస్ చైర్మన్ బాలయ్య తెలిపారు. ఎనిమిదో వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ తమ వారిలో వీధి దీపాల సమస్య ఉందని తెలిపారు. 16వ వార్డులో కైవల్యనది బఫర్ జోన్ లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఆపాలని కౌన్సిలర్ ధనియాల రాధా తెలిపారు. తాను ఎన్నో నెల నుండి చెబుతున్న పట్టించుకోక పోవడం వల్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నట్లు తెలిపారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. పట్టణంలో పబ్లిక్ పర్పస్ స్థలాలను ఆక్రమిస్తున్నాడని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎన్జీవో కాలనీ,బొగ్గులు మిట్ట, తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. ఇంకా అనేక సమస్యలను కౌన్సిలర్లు అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లారు. కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని చైర్ పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు కళ్యాణి, వాయిదా, పూజారి లక్ష్మి, విజయలక్ష్మి, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, మాడ జానకిరామయ్య, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఓపెన్ జిమ్‌కు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



గూడూరు, మే 24 ప్రభాతవార్త : పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఓపెన్ జిమ్ కొరకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శనివారం పరిశీలించారు. అలాగే స్టేడియంలో జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను తనిఖీ చేసారు. నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలో పలు సమస్యలు తెలియజేశారని ఇప్పటికే దాతల సహకారంతో ఇండోర్ జిమ్ ఏర్పాటు చేశామని, స్టేడియం ప్రహరీ గోడను మరమ్మతులు చేయించామని తెలిపారు. హాస్పిటల్ డ్రైనేజీ గ్రౌండ్‌లోకి రాకుండా కలెక్టర్‌తో మాట్లాడి 17 లక్షల రూపాయిలు నిధులు మంజూరు చేయించి కాలువ నిర్మాణం ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. పెన్వర్ కంపెనీ వారి సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని త్వరలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్ర, రవి, గంటా మధుకృష్ణ, థామస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురంలో తీరని ఏళ్ళతరబడి సమస్య

### -ఉన్న భూమి కూడా దారాదత్తం



తొట్టంబేడు, మే 24 ప్రభాతవార్త : మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో 90/1లో 1.80సెంట్లు భూమి ఉండేది. ఈభూమిలో గత కొన్ని సంవత్సరాల క్రితం పెద్ద కొట్లాటలు, కర్రలతో దాడులు చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో తొట్టంబేడు తహశీల్దార్‌గా ఉన్న రేణుకాదేవి ఈస్థలంలో 145సెక్షన్ విధించి ఎవ్వరికి ప్రవేశాలు లేవని తేల్చిచెప్పారు. అయినా కొందరు ఆక్రమణ దారులు తమ ఇష్టానుసారంగా భవనాలు నిర్మించేశారు. ఈస్థలంలోనే సబ్‌ట్రెజరీ కార్యాలయం కూడా ఉంది. ఈస్థలంలో ఇళ్ళు లేని నిరుపేదలు గ్రామంలో ఎంతో మంది ఉన్నారని వారికి ఇక్కడ స్థలాలు ఇవ్వాలని కోరడంతో తహశీల్దార్‌గా ఉన్న రేణుకాదేవి తర్వాత వచ్చిన చంద్రమోహన్ గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించగా అది ఆచరణలో సాధ్యం కాలేదు. అయితే ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన స్థలం కోసం గ్రామస్తులు నిరుపేదలకు ఇవ్వాలని కోరగా సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం గ్రామస్తులతో వివాదాలు ఎందుకని ఉన్న 0.55సెంట్లు భూమిని కూడా తంగేళ్ళపాళెం పిఎసిఎస్ పెట్రోలు బంకును కేటాయించి అధికారులు చేతులెత్తేశారు. ప్రస్తుతం ఇక్కడి భూముల్లో పెట్రోలుబంకు ఏర్పాటు చేయరాదని కోరుతూ మదర్ థెరిస్సా మహిళా మండలి మరియు ఉమెన్ అండ్ చైల్డ్ రూరల్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మేరీ చంద్రమ్మ శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేయగా కోర్టు నుంచి తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. అయితే ఎలాగైనా ఈస్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేయాలని పిఎసిఎస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కానీ మదర్‌థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు మాత్రం ఒప్పుకోవడం లేదు. ఇప్పటికే 1.80 సెంట్ల స్థలాన్ని అధికారులు అందరికీ అప్పగించేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. మదర్‌థెరిస్సా మహిళా మండలి అధ్యక్షురాలు మాత్రం కోర్టుకెళ్ళి చట్ట ప్రకారం ఉన్న భూములు అయినా నిరుపేదలకు ఇవ్వాలని కోరుతున్నారు.



తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాలర్ దివాకర్ రెడ్డిని శనివారం సివిల్ సప్లై మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. -ప్రభాతవార్త, తిరుపతి రూరల్

## వైభవంగా శ్రీశ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు, మే 24 ప్రభాతవార్త : తమ్మినపట్నం గ్రామ పంచాయతీలో తమ్మిన పట్నం గ్రామం నందు వెలసి ఉన్న శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు మూడవ రోజు భాగంగా శనివారం విశ్వక్సేన పూజ, స్వామివారికి చందన అలంకరణం, 1008 తమలపాకులతో ఆకు పూజ, పూర్ణాహుతి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.గిరి కృష్ణ, టీడీపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సతీష్‌యాదవ్, భక్తాన్ని రామయ్య, రామాలయం ధర్మకర్త తిరుపతి పార్లమెంట్ మత్స్య సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల వెంకయ్య, బీసీసెల్ నాగూర్, గ్రామ పెద్దలు కోట రమణయ్య కొప్పాల సుబ్బయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలిరెడ్డిపాలెం సచివాలయం తనిఖీ



వాకాడు, మే 24 ప్రభాతవార్త : మండలం బాలిరెడ్డిపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు తనిఖీ చేయడం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్నటువంటి యోగాంధ్ర సర్వే, ఈకేవైసీలలో వెనుకబడి ఉన్నందువల్ల అవి వెంటనే సకాలంలో పూర్తి చేయవలసిందిగా సచివాలయ సిబ్బందిని ఆదేశించడం జరిగినది, విధుల పట్ల ఎటువంటి అలసత్వం లేకుండా ప్రజలతో సత్సంబాంధాలు కలిగి వారి యొక్క పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా ఉండాలని సిబ్బందికి తెలియజేయడం జరిగినది, సచివాలయంలో ఉన్న పలు రిజిస్టర్లను తనిఖీ చేయడం జరిగినది, సచివాలయ సిబ్బంది ఏమైనా అత్యవసర పని నిమిత్తం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా అది మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి వివరణ ఇచ్చి వెళ్లాల్సిందిగా సచివాలయ సిబ్బందికి సూచించడం జరిగినది, కార్యాలయంలో పరిశుభ్రత పాటించాల్సిందిగా వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా నడుచు కోవాల్సిందిగా ఎంపీడీవో వారు సిబ్బందికి తెలియచేయడం జరిగింది. ప్రభుత్వం చేపడుతున్నటువంటి సర్వేలలో ఎటువంటి అవకతవకలు జరక్కుండా సకాలంలో పూర్తిచేసి మండలాన్ని ముందంజలో ఉంచవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శిల్ప, డిజిటల్ అసిస్టెంట్ విశ్వవీణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ హర్ష పాల్గొన్నారు.

## జూనియర్ ఇంటర్‌కు కౌన్సిలింగ్

కోట,మే 24 ప్రభాతవార్త : మండలం చిట్టేడులోని గిరిజన గురుకులంలో జూనియర్ ఇంటర్‌కు 2025-27 విద్యా సంవత్సరానికి శనివారం మెదటి విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంపిసిలో 40 సీట్లుగాను 9మంది. బైపిసిలో 40సీట్లుగాను 7మంది, సిఇసీలో 40 సీట్లుగాను 3గురు హాజరైనట్లు ప్రిన్సిల్ శేషాద్రి వర్ధన్ తెలిపారు. మిగితా సీట్లుకు రెండోవసారి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### జూనియర్ సివిల్ జడ్జ్ విష్ణువర్మ




వెంకటగిరి, మే 24 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్ విష్ణువర్మ తెలిపారు. మండలంలోని వల్లివేడు గ్రామంలో న్యాయ విజ్ఞానం చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు చేయరని తెలిపారు. పేదలకు ఉచితంగా న్యాయ సూచనలు సలహాలు అందిస్తామని చెప్పారు. సిఐ ఏవి రమణ మాట్లాడుతూ నేరాలకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు రాంప్రసాద్, హేమ గాంధీ, రాజేష్, సునీత, ఆర్ముగం, హరినాథ్‌రెడ్డి, వాసు, చెంచు కృష్ణయ్య, ఎస్సై సుబ్బారావు, ఏఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ దేవత నాగార్పమ్మ జాతర



ఓజిలి, మే 24 ప్రభాతవార్త : మండలం కేంద్రమైన ఓజిలి గ్రామ దేవత శ్రీ నాగారప్పమ్మ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం రెండవ రోజు సాయంత్రం అమ్మవారికి గ్రామంలోని భక్తులు ఇంటిళ్లపాటుగా వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళను పెట్టి నైవేద్యాలను సమర్పించి తమ ముక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ తో అందంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామంలో అమ్మవారు ఊరేగింపు జరుగుతున్నంత సేపు మంగళ వాయిద్యాలు బ్యాండ్ మేళాలు బాణా సంచా కాలుస్తూ, గొల్లలు వీర తాళ్ళు వేసుకుంటూ ఉత్సవం సాగింది. గ్రామస్తులు పిల్లాపాపలతో సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని , ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని భక్తులు మొక్కుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా గ్రామంలో జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆ యొక్క గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ సంతోషంగా పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో హుండి లెక్కింపు



చిల్లకూరు, మే 24, ప్రభాతవార్త : మండల పరిధిలోని కలవకొండ గ్రామంలో కొండపై వెలిసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శనివారం హుండి లెక్కింపు కార్యక్రమం ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల జరిగిన హుండీ లెక్కింపులో 1,39,809 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో గిరి కృష్ణ తెలిపారు.

## మద్యం షాపులు నిబంధలు తప్పక పాటించాలి

### - ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ నాగమల్లేశ్వర్ రెడ్డి



గూడూరు, మే 24 ప్రభాతవార్త : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ నాగమల్లేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి వివిధ సమయాల్లో పెట్రోలింగ్ చేసి మద్యం షాపులు ఏవైనా సమయపాలన పాటించక జరుగుతున్నాయా అని పరిశీలించారు. శనివారం ఉదయం ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తున్నారా? లేదా? అనే అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాపులోను ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలని, రికార్డులు సక్రమంగా ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి రోజు సిబ్బందితో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తామని పట్టుబడితే చర్యలు తప్పవన్నారు. ఆయనతో పాటు తిరుపతి అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.ఎస్. ఊహ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

## 26 నుంచి పీజీఆర్ఎస్ సమయం గంట పొడిగింపు

### - జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపు



తిరుపతి కలెక్టరేట్, మే 24 ప్రభాతవార్త : ప్రతి సోమవారం జిల్లా కేంద్రం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఈ కార్యక్రమం ఈనెల 26వ తేది నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మీడియాతో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎండ తీవ్రత తగ్గినందున ప్రజల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, డివిజన్, మండల కేంద్రాల్లోని సంబంధిత అధికారులు, అన్ని శాఖాధికారులు తెలుసుకోవాలని, అలాగే జిల్లా ప్రజలు, బాధితులు,ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కుప్పంలో ఆలయాలకు మహర్దశ

### - 11 ఆలయాలకు 53 కోట్లు
### -మరో 144 గ్రామీణ ఆలయాలకు 20-25లక్షలతో అభివృద్ధి

కుప్పం, మే 24 ప్రభాతవార్త : నియోజకవర్గంలో ఉన్న ప్రముఖ ఆలయాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వివిధ ఆలయాలను అభివృద్ధి చేసి కుప్పాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మలచాలని సిఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే 11 ఆలయాలకు గాను 53 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. వీటికి సంబంధించి టెండర్లు సైతం పూర్తయ్యాయి. ఇప్పటికే ఈ ఆలయాల అభివృద్ధికి సంబంధించి దేవదాయ శాఖ అధికారులు, స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు ఆలయాలను పరిశీలించి మాస్టర్ ప్లాన్‌లు రూపొందించారు. ఈ ఆలయాలతో పాటు కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె, కుప్పం గ్రామీణ, కుప్పం మున్సిపల్ ప్రాంతాల్లో ఇప్పటివరకు గుర్తించిన 144 గ్రామ దేవతల ఆలయాలను సైతం అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు తీర్మానించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి)కి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఒక్కో ఆలయానికి దాదాపు 20నుంచి 25లక్షలు వ్యయం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామదేవతలు, ఇతర దేవతల ఆలయాలను అభివృద్ధి చేయనున్నారు. తద్వారా కుప్పం ప్రాంతంలో ఆధ్యాత్మికత మరింత వెల్లివిరుస్తుందనడంలో సందేహం లేదు.

ఇక దీంతో పాటు కుప్పం ప్రాంతాన్ని పర్యాటక పరంగా సైతం అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు నిర్ణయించారు. రామకుప్పం మండలంలో ఉన్న ననియాల ఎకో టూరిజం కేంద్రంను మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ పర్యాటకులను ఆకట్టుకునేలా వివిధ నిర్మాణాలు చేపట్టాలని టూరిజం అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. కుప్పం ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) డస్ట్ టు ద క్లౌడ్స్ సంస్థతో ఒప్పందం చేసుకుని గుడివంక ప్రాంతంలో రెండు విడతలుగా కార్, బైక్ రేసింగ్‌లు నిర్వహించింది.

## సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

### - జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



కుప్పం, మే 24 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి భద్రత ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా విధులు చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు పేర్కొన్నారు.దాదాపు 600మందితో భద్రత ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ద్రవిడ వర్సిటీలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్, శాంతిపురం మండలం శివపురం వద్ద ముఖ్యమంత్రి నివాస గృహ పరిసర ప్రాంతాలను ఎస్ఎస్‌జి డైరెక్టర్ నాచికేత్ విశ్వనాథ్‌తో కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. సిఎం తిరుగు ప్రయాణం అయ్యేదాకా పూర్తి బాధ్యతతో విధులు చేపట్టాలని ఆదేశించారు. సిఎం పర్యటన రూట్ మ్యాప్‌ను వివరించారు. బిడిఎం బృందం అంతటా క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. అధికారులు, ముఖ్యనేతల వాహనాలకు పార్కింగ్ వసతి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్పీ శివానంద కిషోర్, కుప్పం డిఎస్పీ పార్థసారథి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై

### అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, మే 24 ప్రభాతవార్త: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇంటర్నేషనల్ వారి ఆర్థిక సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి సంబంధించి సంక్షేమ పథకాల వివరములతో రూపొందించిన పోస్టర్స్, సమాచార పత్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాస్ చైల్డ్ ఫండ్ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అర్హులైన లబ్దిదారులకు డీఆర్‌డీఏ అందిస్తున్న ఫలాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, రాస్ చైల్డ్ ఫండ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమేష్‌రెడ్డి, వి. నాగరాజు, నాగేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## అందరూ కలసికట్టుగా తుడా అభివృద్ధికి కృషి చేద్దాం :తుడా చైర్మన్



తిరుపతి కార్పొరేషన్, మే 24 ప్రభాతవార్త : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అభివృద్ధికి అందరూ కలసికట్టుగా కృషి చేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య వివరించారు. చైర్మన్ మాట్లా డుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. తుడా పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులు, లే అవుట్ల ఏర్పాటు పారదర్శకంగా జరిగేలా అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని అన్నారు. తుడా నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తుడా లో జరుగుతున్న అభివృద్ధి ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అందరూ పనిచేయాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న లే అవుట్లలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడుకు తండోపతండాలుగా కార్యకర్తలు

### -పరిశీలకునికి వివరించిన ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,మే 24 ప్రభాతవార్త : కడప జిల్లాలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే మహానాడుకు శ్రీకాళహస్తి నుంచి భారీ ఎత్తున్న నాయకులను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఇప్పటికే ప్రణాళికలు రూపొందిం చామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పార్టీ పరిశీలకునికి వివరించారు. శనివారం రాత్రి పార్టీ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మొదట ప్రత్యేక ఛాంబర్‌లో శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డితో చర్చించారు. తరువాత ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సారి నిర్వహించే మహానాడు ఎంతో ప్రతిష్టాత్మమైనదన్నారు. పార్టీ అధిష్టానం సూచించిన మేరకు మహానాడుకు హాజరయ్యే వారు క్రమశిక్షణతో జవాబుదారి తనంతో వ్యవహరించాలని పార్టీ పరిశీలకులు శ్రీనివాసులురెడ్డి సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న రెండవ సమావేశం కడపజిల్లాలో ఏర్పాటు గమనించదగ్గ విషయం అన్నారు.నేడు మనం అధికారంలోకి వచ్చాము. ప్రజలు ఎన్నో ఆశలతో మనల్ని గెలిపించారు. వారి ఆశలను ఆడియాసలు కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లును పరిశీలకులకు వివరించారు. అమరావతిలో శ్రీకాళహస్తి కార్యకర్తలు భాగస్వాములు కానున్నట్లు వివరించారు. మండల పార్టీ నాయకుల ఎంపిక పూర్తి అయ్యిందని వివరించారు. సమావేశంలో మారెడ్డి శ్రీనివాసులురెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు.సమావేశంలో బత్తిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గుమ్మడి దశరధాచ్చారి, జి.విజయకుమార్, రంగినేని చెంచయ్య నాయుడు ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

